

ఒంటరి ఏనుగు స్వైరవిహారం


గజదాడిలో ధ్వంసమైన అరటి, కొబ్బరి చెట్లు


ననియాల సమీపంలో ఏనుగు సంచారం

రామకుప్పం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం నానియాల గ్రామ సమీప తోటలపై ఒంటరి ఏనుగు స్వైరవిహారం కొనసాగుతోంది.శుక్రవారం తెల్లవారు జామున 2గంటల ప్రాంతంలో అరటి, టమోటా, మామిడితోటలపై విరుచుకుపడింది. నారాయణప్ప తోటలో గెలలు వచ్చిన సుమారు 15 అరటి చెట్లను, మూడు కొబ్బరి చెట్లను ధ్వంసం చేసింది.ఆయనకే చెందిన టమోటా తోటను కూడా ఏనుగు కొంత మేర తొక్కేసింది. శంకరప్పకు చెందిన తోటలో మామిడి రాశిని తిన్నంతగా తిని, తొక్కి నాశనం చేసింది. నాగరాజు, బెంగళూరప్పలకు చెందిన తోటల్లో కూడా మామిడి కాయలను తిన్నంతగా తిని, నేల రాల్చింది. పలు చెట్ల కొమ్మలను విరిచేసింది. అటవీశాఖ అధికారులు, ట్రాకర్లు అతి కష్టంపై ఏనుగును అటవీ లోతట్టు ప్రాంతం వైపు మళ్ళిస్తున్నా చీకటి పడితే తిరిగి అటవీ సమీప తోటల వైపు వస్తోంది. తోటలపై దాడులకు పాల్పడుతున్న అది ఏ క్షణంలో గ్రామంలోకి వస్తుందోనన్న ఆందోళన గ్రామస్థుల్లో నెలకొంది.ఏనుగు గ్రామం వైపు రాకుండా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు భరోసా ఇస్తున్నప్పటికీ వారిని గజభయం వీడడం లేదు.

పంటలపై 17గజరాజుల దాడులు


అడవిలో వెళుతున్న ఏనుగుల గుంపు



గజదాడిలో ధ్వంసమైన పశుగ్రాసం, పక్కకు ఒరిగిన మామిడిచెట్టు

కల్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు రెండు గ్రూపులుగా వేర్వేరు ప్రాంతాల్లో పంటలపై దాడులు చేస్తున్న 17 ఏనుగులు గత రాత్రి ఒకేగ్రూపుగా ఏర్పడి పంటలపై దాడులు మొదలెట్టడంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ, ఎగువచలం నుండి బయలుదేరిన 17 ఏనుగుల గుంపు ముందుగా అడవికి సరిహద్దులో ఉన్న మామిడితోటల్లోకి ప్రవేశించాయి. కోటపల్లిలోని దామోదర నాయుడికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగులు ఆ భూమికి పక్కనే ఉన్న హంసవేణికి చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కోటపల్లి సమీపానికి చేరుకుని హరినాథ నాయుడికి చెందిన మామిడిచెట్టును పెకలించింది. ఎకరా పశుగ్రాసాన్ని ఏనుగులు తినేశాయి. అక్కడి నుంచి చిత్తూరు-కల్లూరు ఘాట్‌రోడ్ వద్ద ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంకు మీదుగా అడవిలోకి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం ఏనుగులు ధ్వంసం చేసిన పంటల పరిశీలనకు వెళ్లిన అటవీశాఖ సిబ్బందికి అడవిలో వెళుతున్న ఏనుగుల గుంపు కనిపించింది.ఏనుగుల గుంపు చింతలవంక వద్ద పగలంతా తిష్ట వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మధు తెలిపారు.


తిమ్మరాజుపల్లెలో అధికారులు, రాజకీయ నాయకులతో సమావేశమైన కలెక్టర్, ఎస్పీ, పీడీ తదితరులు

2, 3 తేదీల్లో సీఎం కుప్పం పర్యటన

- తిమ్మరాజు పల్లె పంచాయతీలో ఓటర్లతో మమేకం
- తుమ్మిశి మోడల్ స్కూల్ సమీపంలో సభ



కుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటన జులై 2, 3 తేదీల్లో దాదాపు ఖరారైంది.తన పర్యటనను ప్రధానంగా రాజకీయ కార్యక్రమాలకే అది కూడా శాంతిపురం మండలానికే ముఖ్యమంత్రి పరిమితం చేసుకున్నారు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు చంద్రబాబు 2వ తేదీ మధ్యాహ్నం తుమ్మిశి పంచాయతీ పరిధిలోని డుంకుమానిపల్లె వద్ద పునరుద్ధరించనున్న పాత హెలిప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. ఇక్కడినుంచి నేరుగా కడపల్లె సమీపంలో నిర్మించుకున్న గృహానికి వెళ్లిపోతారు. అదే రోజు రాత్రి టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ, నాలుగు మండలాల అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశమై పార్టీ పరిస్థితిని సమీక్షిస్తారు. రాత్రి స్వగృహంలోనే బస చేస్తారు. 3వ తేదీ ఉదయం స్వగృహం ఉన్న పంచాయతీ అయిన తిమ్మరాజుపల్లెకు వెళ్లి ఓటర్లతో మమేకమవుతారు. నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ పరంగా 60మంది ఓటర్లను కలిపి ఒక కుటుంబ సాధికార సమితి (కేఎస్ఎస్)గా ఏర్పరిచారు. ఈ కేఎస్ఎస్‌కు ఒక ఇన్‌చార్జిని నియమించారు.డుంకుమానుపల్లె పంచాయతీలోని అటువంటి ఒక కేఎస్ఎస్‌కు చంద్రబాబు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. వారి కుటుంబాలను కలవడంతోపాటు పంచాయతీలోని మరికొన్ని కుటుంబాలను కలిసి, వారి కష్టనష్టాలను ఆరా తీస్తారు. అనంతరం తుమ్మిశి మోడల్ స్కూల్ ముందు భాగాన గల మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసే సభలో సీఎం పాల్గొంటారు.అదే రోజు సాయంత్రం సమీపంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడినుంచి హెలికాప్టర్ ద్వారా బెంగళూరు, తర్వాత అమరావతి చేరుకుంటారు.మధ్యలో కొన్ని అధికారిక కార్యక్రమాల్లో సైతం చంద్రబాబు పాల్గొనే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. టాటా కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ సెంటర్ (డీఐఎన్‌సీ)ని ప్రారంభించడంతో పాటు, అధికారులతో సమీక్ష జరుపుతారని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు తగిన విధంగా సిద్ధమవుతున్నాయి.

కలెక్టర్, ఎస్పీల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయన పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలను శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, కడా పీడీ వికాస్ మర్మత్ పరిశీలించారు. తుమ్మిశి పంచాయతీ డుంకుమానిపల్లెవద్ద హెలిప్యాడ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు.అనంతరం తిమ్మరాజుపల్లె చేరుకుని, స్థానికులతోను, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. బహిరంగ సభ ఏర్పాట్ల గురించి చర్చించారు. మరోవైపు శుక్రవారం ఉదయం కడా పీడీ వికాస్ మర్మత్ కుప్పం మండల సచివాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వారివారి శాఖల పరిధిలో జరుగున్న అభివృద్ధి పనులపై సమగ్ర డీపీఆర్ తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.శాంతిపురం మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్రావిడ వర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు


ద్రావిడ వర్సిటీ ప్రధాన ప్రవేశ ద్వారం

కుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం విద్యార్థులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఇంజనీరింగ్ కళాశాలను ద్రావిడ విశ్వవిద్యాలయానికి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కళాశాల మంజూరైనట్లు విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), సీఎస్ఈ విత్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) అనే రెండు కోర్సులు మాత్రమే ఆఫర్ చేస్తున్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్లుంటాయి. కళాశాల మంజూరు కావడంపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం హర్షం వ్యక్తం చేశారు.ప్రజల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

తదుపరి లక్ష్యంగా యూజీ, పీజీ, బీఈడీ కళాశాలల అనుబంధం

గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ద్రావిడ విశ్వవిద్యాలయానికి రెండు ముఖ్యమైన కోర్సులతో ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయడంపట్ల వర్సిటీ ఇన్‌చార్జి ఉప కులపతి ఎం.దొరస్వామి, రిజిస్ట్రార్ వి.కిరణ్ కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తదుపరి లక్ష్యంగా చిత్తూరు జిల్లాలోని యూజీ, పీజీ, బీఈడీ కళాశాలలను వర్సిటీకి అనుబంధంగా తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం ద్రావిడ విశ్వవిద్యాలయానికి అన్నిరకాలుగా మద్దతు ఇస్తున్నదన్నారు.అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగు జీతాలుగా మొదటి దశలో రూ.2.86 కోట్లు, రెండవ దశలో రూ.5.2 కోట్లు విడుదల చేయడంతోపాటు మూడేళ్ల వేతన భరోసా కొనసాగించేందుకు అంగీకరించిందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌కు,ఏపీఎస్‌సీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానంతో ఆలిని చంపేశాడు

పాలసముద్రం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకుని, చివరకు ఆమెను హత్య చేశాడో వ్యక్తి. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములైన షణ్ముగం, కార్తీక్ ఆరేళ్ల కిందట పాలసముద్రం మండలంలోని తిరుమలరాజుపురం పంచాయతీ అడవికాల్వ వద్ద వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఇక్కడే అన్నదమ్ములు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిలో కార్తీక్, ప్రమీల దంపతులకు సంతానం కలగలేదు. కొన్ని రోజులుగా ప్రమీలపై అనుమానం పెంచుకున్న కార్తీక్.. మద్యానికి బానిసయ్యాడు. రెండ్రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో ఉన్న కార్తీక్ ఓ కర్ర తీసుకుని భార్య తలపై కొట్టి చంపేశాడు. ప్రమీల కొనఊపిరితో ఉందేమోనన్న ఉద్దేశంతో కార్తీక్ సోదరుడైన షణ్ముగం ఆమెను తమిళనాడు షోళింగర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమీల మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్థీ గ్యాంగ్ పనేనా?

- పథకం ప్రకారమే రైల్లో దోపిడి
- విచారణ ముమ్మరం చేసిన పోలీసులు


ఘటనా స్థలం వద్ద గురువారం తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు


కత్తిరించిన సిగ్నల్ వైరు


చిత్తూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారి

చిత్తూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సమీపంలోని సిద్ధంపల్లె రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి మరీ గురువారం రైలులో దోపిడీ చేసిన విషయం తెలిసిందే. ఈ దోపిడి ఒక పథకం ప్రకారమే జరిగినట్లు రైల్వే పోలీసులు తేల్చారు. దీనివెనుక మహారాష్ట్రకు చెందిన పార్థీగ్యాంగ్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం రైల్వే, రాష్ట్ర పోలీసులు కలిసి ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి జల్లెడ పడుతున్నారు. మహారాష్ట్ర నుంచి వాహనంలో వచ్చారా? అన్న కోణంలో టోల్‌గేట్లలో తనిఖీ మొదలు పెట్టారు. ఇప్పటికే ఘటన స్థలంలో.. ఫింగర్‌ప్రింట్ సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు.

నెల రోజుల్లో మూడుచోట్ల..

నెల రోజుల వ్యవధిలోనే ఇదే తరహా దోపిడీలు మూడు చోట్ల జరిగాయని సమాచారం. రెండు.. తిరుపతి సెక్షన్ పరిధిలోని ముంగిలిపట్టులో జరిగితే మూడోది.. చిత్తూరు సెక్షన్ పరిధిలోని సిద్ధంపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. ఈ మూడు దోపిడీలు ఒకేలా ఉండడంతో అధికారులు ఒకే ముఠా పనేనని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఇటీవల గుంతకల్లు, గుత్తి, రేణిగుంట, కర్నూలు, కడప ప్రాంతాల్లో ఇటువంటి దోపిడీలు జరిగినట్లు తెలుస్తోంది. చిత్తూరులో ఇలాంటి దోపిడీ ఇదే మొదటిదని అధికారులు చెబుతున్నారు. ఈ నెలలో జరిగిన మూడు దోపిడీల్లో సుమారు 250 గ్రాములకుపైగానే బంగారునగలు దోచుకున్నట్లు తెలిసింది. వరుస దోపిడీలతో రైలు ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

బంగారం ధర పెరగడం కూడా ఒక కారణం

ఇటీవల బంగారం ధర పెరిగిపోవడం వల్ల కూడా దుండగులు ఇలాంటి దోపిడీలు చేస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకోసం మారుమూల రైలు రూట్లను ఎంచుకుంటున్నారు. సిగ్నల్ వైరు కట్ చేసి.. రైలు ఆగేలా చేయడం.. ఆవెంటనే దోపిడీ చేసి పరారవుతున్నారు. ఈ దోపిడీని రైలులోని ఆర్పీఎఫ్ పోలీసులు తెలుసుకునేలోపే దుండగులు మాయమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో సిగ్నల్ వ్యవస్థను మరింత పటిష్ఠంగా అమలు చేయాల్సి ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే పోలీసులు నిర్లక్ష్యం కూడా కారణమా?

రైల్వే పోలీసులు నిర్లక్ష్యం కూడా దోపిడీకి కారణమని ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైలులో గస్తీ నిర్వహించే పోలీసులు ఎవరైనా అనుమానితులు కనిపిస్తే విచారించాలి. అదుపులోకి తీసుకోవాలి. వీరు నిర్లక్ష్యంగా ఉండటంతోనే దోపిడీలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. ఇదే విషయమై వీరికి గురువారం మధ్యాహ్నం ఓ ఉన్నతాధికారి క్లాసు తీసుకున్నారు. మీ నిర్లక్ష్యం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉంటే గస్తీ సిబ్బంది సుమారు 50 శాతం వరకు కొరత ఉందని తెలుస్తోంది. రెండు మూడు రైలు పెట్టెలకు ఒక్కో పోలీసు ఉండాల్సి ఉండగా.. రైలు మొత్తానికి ఇద్దరే ఉంటున్నారని సమాచారం.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, తిరుపతి అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజరెడ్డి తదితరులు

వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం

చిత్తూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ పర్యవేక్షించారు. బదిలీల కోసం ఆప్షన్‌ను నమోదు చేసుకున్న చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వార్డు కార్యదర్శులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. వార్డు అడ్మిన్ కార్యదర్శులు 153 మంది, వార్డు అమినిటీ కార్యదర్శులు 178 మంది, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు 143 మంది కలిపి మొత్తం 474మంది హాజరయ్యారు. తిరుపతి నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ చరణ్‌తేజరెడ్డి, చిత్తూరు సహాయ కమిషనర్ ప్రసాద్, పురపాలక సంఘాల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు 'కేర్ అండ్ గ్రో'

- కుప్పంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.2.89 కోట్లతో ప్రత్యేక కార్యక్రమం
- లోపాలున్న పిల్లలపై నిపుణులతో పర్యవేక్షణ


కుప్పంలో పిల్లల వివరాలు నమోదు చేసుకుంటున్న అంగన్‌వాడీలు

చిత్తూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని అంగన్‌వాడీ పిల్లల మానసిక లోపాలను గుర్తించి సరి చేసేందుకు ప్రభుత్వం 'కేర్ అండ్ గ్రో' ప్రాజెక్టును ప్రారంభించింది. నియోజకవర్గంలోని 428 అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ దీన్ని చేపట్టనుండగా.. ప్రస్తుతం కొన్నింట్లో మాత్రమే ప్రారంభించారు. సీఎం చంద్రబాబు జూలై 2న కుప్పంలో పర్యటించనున్న సందర్భంగా, మిగిలిన కేంద్రాల్లోనూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.గత ఏడాది అక్టోబరులో 25అంగన్వాడీ కేంద్రాల్లో 'కేర్ అండ్ గ్రో' ప్రాజెక్టును పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. 1711మంది పిల్లలకు ఏఐ ఆధారిత పరీక్షలు చేశారు. వీరిలో 612మందికి ఒకటి కంటే ఎక్కువ లోపాలున్నట్లు గుర్తించారు. 39 మందికి నాలుగుకు మించి లోపాలున్నట్లు గుర్తించి, నిపుణుల వద్దకు పంపించారు. 30 రోజుల పాటు చేయాల్సిన పనుల్ని వారి తల్లిదండ్రులకు సూచించారు. శిక్షణ పొందిన ఫీల్డ్ కోఆర్డినేటర్లు ఇళ్లకు వెళ్లి లోపాలున్న పిల్లల్ని పర్యవేక్షిస్తున్నారు. వచ్చే నెల రెండో వారంలో రెండో దశ స్క్రీనింగ్ పరీక్షల్ని ప్రారంభించనున్నారు.నియోజకవర్గంలోని 428 కేంద్రాలకు మే నెలలో జియోట్యాగింగ్ పూర్తి చేశాక ఈ నెల 11, 13 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. లోపాలున్న పిల్లల తల్లిదండ్రులకు 90కిపైగా వాట్సాప్ గ్రూపుల్ని ఏర్పాటుచేశారు. రోజూ ఆ గ్రూపుల్లో పిల్లలతో చేయించాల్సిన పనుల గురించి వీడియోలు, మెసేజ్‌లు పంపిస్తుంటారు. మాట్లాడే, అరిచే, రాసే, భావోద్వేగాలు (ఎమోషన్స్) పలికించేలా శిక్షణ ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టును నిర్వహించేందుకు రూ.2.89 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

ప్రాజెక్టు పురోగతి వివరాలు

- మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు: 428
- కేర్ అండ్ గ్రో ప్రాజెక్టును ప్రారంభించిన కేంద్రాలు: 134
- మొత్తం చిన్నారులు: 21,093
- స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకున్నవారు: 1516
- లోపాలున్నట్లు గుర్తించిన చిన్నారులు: 612
- ఒక లోపం ఉన్నవారు: 317
- రెండు లోపాలు: 166
- మూడు లోపాలు: 90
- నాలుగు కంటే ఎక్కువ లోపాలున్నవారు (నిపుణులకు సిఫార్సు చేయబడ్డవారు): 39

వరసిద్ధుడి సేవలో సీసీఎల్ఏ జయలక్ష్మి


ఆలయంలో అధికారులతో జయలక్ష్మి

ఐరాల(కాణిపాకం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) జయలక్ష్మి శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. తహసీల్దార్ లోకేశ్వరి, డీటీ మహేష్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా మురళీ మోహన్



చిత్తూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా మురళీమోహన్‌ను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం ఏవోగా బాధ్యతలు స్వీకరించగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న సీకే శ్రీనివాసులు బదిలీపై జీడీనెల్లూరు తహసీల్దార్‌గా వెళ్లారు.

డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా రవిశేఖర్


డీఈవో నుంచి పదోన్నతి పత్రం అందుకుంటున్న రవిశేఖర్

చిత్తూరు సెంట్రల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కార్వేటినగరం ప్రభుత్వ డైట్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవిశేఖర్‌కు డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు కడప ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతిపై జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చిన ఆయన శుక్రవారం డీఈవో వరలక్ష్మి సమక్షంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఈవో కార్యాలయంతోపాటు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్ హోదాల్లో ఈయన పనిచేశారు.

డీసీసీబీ వార్షిక నివేదికకు ఆమోదం


వార్షిక నివేదికను చదువుతున్న బ్యాంకు సీఈవో శంకర్‌బాబు

చిత్తూరు సెంట్రల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ది చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) వార్షిక నివేదికను శుక్రవారం ఆమోదించారు. స్థానిక డీసీసీబీ కార్యాలయంలో చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా సహకార అధికారి లక్ష్మి సమక్షంలో బ్యాంకు మహాజన సభ నిర్వహించారు. 2024-25 సంవత్సరం బ్యాంకు ఆడిట్ సర్టిఫికెట్, ఆడిట్ చేయబడిన జమా ఖర్చులు, ఆస్తి, అప్పుల పట్టిక, లాభనష్టాలు నివేదికను ఆమోదించారు. 2024-25 సంవత్సరానికి బ్యాంకు రూ.510 కోట్ల లాభం ఆర్జించగా, నికర, నిరర్థక ఆస్తులు 1.92శాతం, డిపాజిట్లు రూ.998.84 కోట్లు, రుణాలు రూ.2436.50 కోట్లుగా చూపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రూ.76.51 లక్షలు డివిడెండ్‌గా ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. అలాగే సంఘాల బలోపేతంలో భాగంగా రుణాల మంజూరుకు తీర్మానించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తూ.. ఖాళీలను భర్తీ చేయడానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడానికి తీర్మానం చేశారు. సమావేశంలో బ్యాంకు సీఈవో శంకర్‌బాబు, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి వనజ, సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హోటల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు

చిత్తూరు సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులోని ఒక హోటల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారి నాగేంద్ర బాబు శుక్రవారం తనిఖీలు చేశారు. హోటల్లో వాడుతున్న చికెన్, మటన్‌తో పాటు వంటలకు ఉపయోగించే మసాలాలను, కూరగాయలను పరిశీలించారు. చికెన్ శాంపిల్స్ తీసుకున్నారు. వాటిని పరీక్ష నిమిత్తం హైదరాబాదులో నాణ్యతను పరిశీలించే ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు. జర్నలిస్టులు ఫొటోలు తీస్తుండగా నాగేంద్ర బాబు అడ్డుకున్నారు. ఇన్వెస్టిగేషన్ చేసేటపుడు ఫొటోలు తీయకూడదని, హైకోర్టు ఆర్డర్ ఉందని చెప్పడంతో జర్నలిస్టులకు, ఫుడ్ సేఫ్టీ అధికారికి మధ్య వాగ్వాదం జరిగింది.


గొల్లపల్లె జైన్‌ఫ్యాక్టరీ గేట్ వద్ద వేచి వున్న మామిడి ట్రాక్టర్లు

తీరని రైతుల అవస్థలు


గొల్లపల్లె జైన్‌ఫ్యాక్టరీ వద్ద చిత్తూరు - పుత్తూరు రహదారిపై బారులు తీరిన ట్రాక్టర్లు

గంగాధరనెల్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడికాయలు అమ్ముకోవడానికి రైతులు పడే అవస్థలు తీరడం లేదు. గంగాధరనెల్లూరు మండలంలోని రెండు జైన్ జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద మామిడికాయల లోడ్‌తో ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి.తోపుల్లో రాలిపోతున్న మామిడికాయల పరిస్థితిని చూసి రైతులు ఆందోళన పడుతున్నారు. కాయలను కోసేసి ఫ్యాక్టరీకి తోలేస్తే కొంతవరకైన నష్టపోకుండా ఉంటామని ట్రాక్టర్లల్లో మామిడికాయలను తీసుకొస్తూనే ఉన్నారు. అధికారులు గుర్తించి టోకెన్లు కేటాయించగా, ప్రస్తుతమున్న మామిడికాయలఅన్‌లోడింగ్‌కే రెండురోజులు పడుతుందని భావిస్తున్నారు.హార్టికల్చర్ డీడీ మధుసూదన రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి తదితరుల పర్యవేక్షణలో ఫ్యాక్టరీల వద్ద మామిడి కాయలతో వేచివున్న రైతులకు ఇబ్బంది లేకుండా భోజనం, తాగునీటి ఏర్పాట్లు చేస్తున్నారు.

ర్యాంపుల నుంచి ఎగుమతుల జోరు!

పెరిగిన రూపాయిన్నర ధర ● మరింత పెరిగే అవకాశం



తిమ్మోజీపల్లి ర్యాంపు నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు సిద్ధమైన మామిడి లారీలు

చిత్తూరు సెంట్రల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మామిడి ఎగుమతులు జోరందుకున్నాయి.రెండు రోజులుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న మామిడిని ర్యాంపుల నిర్వాహకులు తమిళనాడులోని కృష్ణగిరి, మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ర్యాంపుల ద్వారా రోజూ సేకరిస్తున్న వెయ్యి టన్నుల మామిడి ఇతర ప్రాంతాలకు ఎగుమతి కావడంతో ధరలు సైతం పెరుగుతున్నాయి. రూ.2కే పరిమితమైన కేజీ తోతాపురి కాయలను ర్యాంపు నిర్వాహకులు రూపాయిన్నర పెంచి శుక్రవారం నుంచి రూ.3.50కి కొనుగోలు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ ధర రూ.5కు చేరే అవకాశం ఉన్నట్లు అంచనా.ర్యాంపులపై మార్కెటింగ్ శాఖ అధికారుల నిత్య పర్యవేక్షణ సత్ఫలితాలను ఇస్తున్నట్లు చెబుతున్నారు. ర్యాంపుల్లో మామిడి సేకరణ స్వల్పంగా తగ్గినా, వచ్చిన మామిడి కాయలను ఎగుమతి చేస్తుండడం ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

మామిడి రైతుల సబ్సిడీ నమోదు వేగవంతం


రైతుల సబ్సిడీ వివరాలు నమోదు చేస్తున్న మార్కెటింగ్ శాఖ సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నమోదు ప్రక్రియ వేగవంతమైంది. రెండు వారాలుగా జిల్లా ఉద్యాన, మార్కెటింగ్ శాఖలు దాదాపు 1.50 లక్షల టన్నుల మామిడికి రావాల్సిన సబ్సిడీ మొత్తాలను నమోదు చేశారు.ఫ్యాక్టరీలు కొనుగోలు చేసిన మామిడికి ఉద్యానశాఖ అధికారులు, ర్యాంపు నిర్వాహకులు కొనుగోలు చేసిన మామిడికి మార్కెటింగ్ శాఖ అధికారులు, ఆయా ప్రాంతాల నుంచి సేకరించిన రైతుల వివరాలను శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ప్రభుత్వానికి పంపాల్సిన నివేదిక తయారు చేయడంతో పాటు సబ్సిడీ నమోదు చేపట్టారు. వచ్చే వారంలో మామిడి రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ నగదు జమకానుంది.

కలర్ తోతాపురి టన్ను రూ.14 వేలు


కలర్ తోతాపురి వేలం వేస్తున్న మండీ యజమానులు

బంగారుపాళ్యం,జూన్27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం మేలైన కలర్ తోతాపురి రకం టన్ను రూ.14 వేల రూపాయలు పలకగా గుజ్జుపరిశ్రమకు తరలించే తోతాపురి రకం ర్యాంపుల వద్ద టన్ను రూ.2.500 పలికింది. అలాగే టేబుల్ రకాలైన మల్గోవా టన్ను రూ.30 నుంచి 70 వేలు పలకగా బేనిషా కవర్ కాయ టన్ను రూ.25 వేల నుంచి 56 వేల ధర పలికింది. మల్లిక టన్ను రూ.25 నుంచి 55 వేల దాకా కాయ నాణ్యత,సైజును బట్టి ధరలు పలికాయి.శుక్రవారం సాయంత్రం కలర్ తోతాపురిని వేలం వేయగా చెన్నైకి చెందిన వ్యాపారవేత్త ఏలుమలై టన్ను రూ.14 వేలకు వేలంలో దక్కించుకున్నారు. గత ఏడాది కలర్ తోతాపురి టన్ను రూ.28 నుంచి 38 వేల వరకు వెళ్ళడం గమనార్హం.

ఊపిరి పీల్చుకున్న మామిడి రైతులు

రెండ్రోజుల్లోనే అన్‌లోడింగ్ జరిగేలా అధికారుల చర్యలు


రైతుకు టోకెన్ అందజేస్తున్న ఎస్ఐ రామ్మోహన్

గుడిపాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలను ఫ్యాక్టరీల వద్ద అన్‌లోడ్ చేయడానికి రైతులకు ఐదు, ఆరు రోజుల సమయం పట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్.. రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాంతో శుక్రవారం నుంచి ఫ్యాక్టరీల వద్ద రెండ్రోజుల్లోనే అన్‌లోడింగ్ అయ్యేలా ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్ చర్యలు చేపట్టారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు ఏ ఫ్యాక్టరీకైనా మామిడి కాయలను తోలవచ్చని సూచించారు. దీనివల్ల ఒక్క రోజులోనే అన్‌లోడింగ్‌కు అవకాశం ఉంటుందని చెప్పారు.

వివాదాస్పదంగా 'డీసీఈబీ' నిర్ణయాలు!



డీసీఈబీ కార్యాలయం

చిత్తూరు సెంట్రల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం (డీసీఈబీ) కమిటీ నిర్ణయాలు విద్యాశాఖలో వివాదాస్పదంగా మారాయి. తాజాగా 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాలల ఐచ్ఛిక సెలవుల విషయంతో ఏకంగా రాష్ట్ర విద్యాశాఖలోనే ప్రకంపనలు సృష్టించింది. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా డీఈవో వరలక్ష్మి, సభ్యులుగా డిప్యూటీ డీఈవో, జడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల నుంచి ప్రతిపాదించిన హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉంటారు. విద్యా సంవత్సరంలో అకడమిక్ క్యాలెండర్ ఆధారంగా నిర్వహించే పరీక్షల నిర్వహణ, స్టడీ మెటీరియల్ తయారీ, ముద్రణ, పంపిణీ, బడుల అభివృద్ధి, విద్యార్థుల నైపుణ్యాల పెంపు, ప్రైవేటు పాఠశాలలకు నిర్వహించే పరీక్షలు, వాటికి అవసరమైన ప్రశ్నపత్రాలు, ఇతర మెటీరియల్ తయారీ, సరఫరా, అవసరమైన వనరుల సమీకరణ, పాఠశాలలకు ప్రకటించే సెలవులు ఇలా అనేక రకాలైన వ్యవహారాలకు కేంద్రంగా డీసీఈబీ నిర్వహణ ఉంటుంది. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ అనుమతి లేకుండానే ఐదు ఐచ్ఛిక సెలవులు నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూరీ జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు తొలి ఐచ్ఛిక సెలవు దినంగా డీసీఈబీ కార్యదర్శి ప్రకటించారు. దీనికి చైర్‌పర్సన్ ఆమోదం లేకపోవడంతో వివాదంగా మారింది. ఈ సమాచారం ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు యాజమాన్యాల సాంకేతిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కాసేపటికే రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఈ సెలవు నిర్ణయంపై డీఈవోను వివరణ కోరారు. డీఈవో ఇచ్చిన సమాధానం ఆధారంగా ఇటు కడప ఆర్జేడీ, అటు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఐచ్ఛిక సెలవు కేవలం ఉద్యోగి వ్యక్తిగతానికి సంబంధించిదని, పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ జరుగుతున్న తరుణంలో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పాఠశాలలకు సెలవులు ప్రకటించరాదని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి.

గ్రావెల్ అక్రమ తరలింపునకు అడ్డుకట్ట

కలెక్టర్ ఆదేశాలతో అధికారుల చర్యలు



గ్రావెల్ టిప్పర్లను అడ్డుకుంటున్న అధికారులు

పాలసముద్రం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని బలిజకండ్రిగ, వనదుర్గాపురం అటవీ ప్రాంతాల నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను శుక్రవారం తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప అడ్డుకున్నారు. మండలం నుంచి కొన్ని నెలలుగా గ్రావెల్‌ను అక్రమంగా అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎస్ఐలు గ్రావెల్ అక్రమ తరలింపునకు చర్యలు చేపట్టారు. అనుమతి లేకుండా గ్రావెల్‌ను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ దేవి, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి, సుభిక్షం కోసం స్కేటింగ్



నాయుడుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాంతియుత వాతావరణం నెలకొని సుభిక్షంగా ఉండాలని బిహార్‌కు చెందిన రోహన్ స్కేటింగ్ ద్వారా పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. చెన్నై నుంచి శుక్రవారం నెల్లూరు వెళ్తున్న రోహన్ నాయుడుపేటలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. 'బీజాపూర్‌కు చెందిన నేను వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నా. దేశంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ప్రార్థిస్తూ ఫిబ్రవరి 11న స్కేటింగ్ ద్వారా శాంతి యాత్ర మొదలు పెట్టా. 7 నెలల పాటు ఈ యాత్ర సాగనుంది' అని పేర్కొన్నారు.

డీపీటీవోగా జగదీష్ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా జగదీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలోని డీపీటీవో కార్యాలయం చేరుకుని సంతకం చేశారు. అనంతరం రోజువారి కార్యకలాపాలలో పాల్గొన్నారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, ఇతర అధికారులు ఆయన్ను అభినందించి, సన్మానించారు.

ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో ఎంఎస్ఎంఈ కీలకం

నూతన సాంకేతికత, అవకాశాలను అందిపుచ్చుకోవాలి ● యువపారిశ్రామికవేత్తలకు మంత్రి కొండపల్లి పిలుపు



పలువురు పారిశ్రామికవేత్తలతో ఎంవోయూలు చేసుకుంటున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అధికారులు - ఎంఎస్ఎంఈ దినోత్సవానికి హాజరైన వారు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాత్ర కీలకమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాల్లో 90 శాతం.. ఉద్యోగాల్లో 70 శాతం వాటా వీటిదేనన్నారు. తిరుపతి సమీపం తాజ్ హోటల్‌లో శుక్రవారం జరిగిన ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నూతన సాంకేతికతను, అవకాశాలను అందిపుచ్చుకుని ఎంఎస్ఎంఈలు మరింతగా ఎదగాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై శాఖలతో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. 'ఒక కుటుంబం- ఒక పారిశ్రామిక వేత్త' దృష్టికోణంతో చంద్రబాబు ఎంఎస్ఎంఈలకు బ్యాంకు లింకేజీతోపాటు పలు సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇస్రో వంటి సంస్థల సమీపంలో అంతరిక్ష సంబంధిత ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వమే కాకుండా ప్రైవేటు సంస్థలనూ భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటి నుంచి పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలన్నది సీఎం చంద్రబాబు గొప్ప నిర్ణయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ ఎస్పీ సోమనాద్ పేర్కొన్నారు. రానున్న నాలుగేళ్లలో ఎంఎస్ఎంఈలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్‌రావు అన్నారు. జిల్లాలో 1.80లక్షల మంది ఎంఎస్ఎంఈ రంగాలపై ఆధారపడి ఉన్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 186 యూనిట్ల లక్ష్యానికి 647 యూనిట్లను సాధించారన్నారు. తిరుపతి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం తదితరులు ప్రసంగించారు.

9 ఎంవోయూలు

ఎంఎస్ఎంఈ దినోత్సవంలో వివిధ సంస్థలతో 9 ఎంవోయూలను కుదుర్చుకన్నట్లు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ విశ్వ తెలిపారు. నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్(వైజాగ్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ (హైదరాబాద్), ఎన్ఐడీ, ఎన్‌వీసీ, సీఎస్‌టీ ఎంఎస్ఈ, ఎస్ఐడీబీఐ, ఎస్‌టీఈవోనేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వారితో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు. విశేష ప్రతిభ కనబరచిన ఎంఎస్ఎంఈలను, ఎస్ఏసీఈ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ అయ్యర్‌ను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఎంఎస్ఎంఈ ఈడీ సుదర్శన్‌బాబు, జిల్లా పరిశ్రమల జీఎం చంద్రశేఖర్, ఏపీఐఐసీ జడ్ఎం విజయభరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 281 మంది హాజరు

● నేటితో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి ● 30 నుంచి ఆప్షన్ల నమోదు


తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

తిరుపతి(విద్య), జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 281 మంది అభ్యర్థులు హాజరైనట్లు కౌన్సెలింగ్ జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. 1,04,001 నుంచి 1,20,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరిగింది. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 193 మంది, సత్యవేడులో 15 మంది, గూడూరులో 73 మంది సర్టిఫికెట్లను ధ్రువీకరించుకున్నారు. శనివారం 1,20,001 నుంచి చివరి ర్యాంకు వరకు జరిగే కౌన్సెలింగ్‌తో సర్టిఫికెట్ల పరిశీలన ముగియనుంది. 30వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఆప్షన్ల నమోదు ప్రారంభమవుతుంది.

హంద్రీ-నీవాతో కుప్పం సస్యశ్యామలం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చలపతి తదితరులు

రామకుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గానికి హంద్రీ-నీవా జలాలు తీసుకురావాలన్న టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ కన్న కలలను సీఎం చంద్రబాబు సాకారం చేస్తున్నారని తెలుగు రైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం అన్నారు. శుక్రవారం వారు రామకుప్పంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాయలసీమతోపాటు వర్షాధార ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో తాగు, సాగునీటి శాశ్వత పరిష్కారం కోసం హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణాజలాలు తీసుకురావాలన్న ధృఢ సంకల్పంతో చేసిన భగీరథ ప్రయత్నం త్వరలో ఫలిస్తుందన్నారు. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయని వారు తెలిపారు. ఒకటి రెండు నెలల్లోనే పనులు పూర్తవుతాయన్నారు. ఈ ఏడాదే కుప్పానికి కృష్ణా జలాలు తరలిరానున్నాయని తెలిపారు. పాలారు నదిపై ఉన్న 17 చెక్‌డ్యాముల మరమ్మతులకు రూ.53.35 కోట్లు, 51 చెరువుల మరమ్మతుల కోసం రూ.14.22 కోట్ల నిధులను సీఎం చంద్రబాబు మంజూరు చేశారని గుర్తు చేశారు. మామిడి రైతులను ఆదుకునేందుకు టన్నుకు రూ.4 వేలు అందిస్తోందన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ కార్యక్రమంతో రైతుల అకౌంట్లలోకి పెట్టుబడి నిధి సాయం జమవుతుందని తెలిపారు. సమావేశంలో రామకుప్పం, శాంతిపురం మండలాల తెలుగురైతు విభాగ నేతలు కొళ్లపల్లెబాబు, గోపాల్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకుందాం..!



మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

శాంతిపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఓ మొక్కను నాటి ప్రకృతిని కాపాడుకుందామని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు అన్నారు. స్వచ్ఛ మొరసనపల్లెలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మొరసనపల్లె వద్ద ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృక్ష సంపద తగ్గి పచ్చదనం అంతరించి పోవడంతో కాలుష్యం పెరిగిపోయి ప్రకృతి నాశనమవుతుందన్నారు. దీంతో వర్షాలు లేక రైతన్నలు వలస కూలీలుగా మారడంతో ఆహారం కలుషితమై ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు నారాయణస్వామి, గోపాల్, మణి, రమేష్, బాలకృష్ణ, సుగుణమ్మ, పంచాయతీ కార్యదర్శి స్వాతి, సర్పంచ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు

శాంతిపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను కార్యకర్తలు, నాయకులు, ప్రజలు సమష్టిగా విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్‌నాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో కడపల్లె పంచాయతీ పరిధిలోని కార్యకర్తలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 2, 3 తేదీలలో కుప్పం నియోజకవర్గ పర్యటనకు సీఎం చంద్రబాబు నాయుడు వస్తున్నారని తెలిపారు. అలాగే తిమ్మరాజుపల్లె గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించి 60 మంది ఓటర్లను కలిసి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకుంటారన్నారు. అలాగే తులసినాయనపల్లె వద్ద గల ఆదర్శ పాఠశాల ఆవరణలో బహిరంగ సభ ఉంటుందని అధికారులు తెలిపారన్నారు. అయితే ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా బహిరంగ సభ, తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, నేతలు క్లస్టర్ ఇన్‌చార్జీలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జీలు పెద్దన్న, నారాయణస్వామి, మంజునాథ్, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, కృష్ణప్ప, చంద్ర, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి



సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బిజిగానిపల్లె గ్రామస్తులు

గుడుపల్లె, జూన్ 27 (ఆంధజ్యోతి): మండలంలోని బిజిగానిపల్లెలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించాలని మండల పరిషత్తు కార్యాలయం ఎదుట శుక్రవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ బిజిగానిపల్లెలో గత ఆరు నెలలుగా నీటి సమస్య ఉందని.. అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందించారు.

రేపు మహారాజ్ శోభాయాత్ర



శోభాయాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హిందూ జాగరణ సమితి సభ్యులు

పుంగనూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న పుంగనూరులో నిర్వహించే ఛత్రపతి శివాజీ శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూ జాగరణ సమితి సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో శోభా యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్ఎస్‌పేట నుంచి బ్రాహ్మణవీధి, సుబేదార్‌వీధి, తూర్పుమొగసాల, ఎంటీటీరోడ్డు, ఇందిరాసర్కిల్, ప్రైవేటు బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకు శోభయాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హిందూ జాగరణసమితి అధ్యక్షుడు పరమేశ్, ఉపాధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి హరీష్, త్రిమూర్తిరెడ్డి, రవిరాజు, వెంకటేశ్, ధనుష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షేక్ ఆరీఫా

పుంగనూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి అధికారులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫా, మదనపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సుభాన్ కోరారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

సోమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై టీడీపీ నాయకులు స్పందించి వాటి పరిష్కారానికి అధికారులతో కలిసి పనిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. శుక్రవారం సోమలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థాయికమిటీల నియామకంతో ఉత్సాహవంతులకు మండల కమిటీల్లో అధిష్టానం ఆదేశాలతో అవకాశాలు ఉంటాయన్నారు. గ్రామస్థాయి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పి.వి శివశంకర్, మహేంద్రబాబు, రెడ్డి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

రేపు పీఎంకేతాండాలో మెగా ఆరోగ్య శిబిరం

రామకుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పం మండలం పీఎంకే తాండాలో మెగా ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి పీఆర్‌వో వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే శిబిరంలో వైద్యులు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శిబిరానికి తమ వెంట ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

చౌడేపల్లె వైద్యాధికారిగా మూనా



చౌడేపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిగా డాక్టర్ మూనా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా అమ్మఅడుగూరులో పనిచేస్తున్న ఆమె బదిలీపై చౌడేపల్లె పీహెచ్‌సీకి వచ్చారు. సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బడిఈడు పిల్లల నమోదు వేగవంతం



పాయలగుట్టలో బడిఈడు పిల్లలతో ఉపాధ్యాయులు

సోమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లల నమోదు వేగవంతం చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో ఉపాధ్యాయులు పల్లె బాట పట్టారు. శుక్రవారం మండలంలోని పాయలగుట్ట, నెలుకూరివారిపల్లెలో వడ్డిపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం పి.ఆర్. శ్రీదేవి ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ సభ్యులు బడి ఈడుపిల్లల తల్లిదండ్రులను కలిసి పదేళ్లలోపు పిల్లలను బడిలో చేర్పించడానికి చర్యలు చేపట్టారు. అలాగే నెల్లిమంద లో హెచ్ఎం ఎల్లయ్య ఉపాధ్యాయులు బడిఈడు పిల్లల కోసం పల్లెబాట పట్టారు.

రైలు నుంచి దూకి ఆత్మహత్య



వృద్ధుడి మృతదేహం

కుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మల్లానూరు రైల్వే స్టేషన్ యార్డులో ఓ వృద్ధుడి (60) శవం లభ్యమైంది. తెలుపు రంగు చొక్కా, నేవీ కలర్ ప్యాంటు ధరించిన గుర్తు తెలియని ఈ వృద్ధుడు గురువారం రాత్రి చెన్నై నుంచి బెంగళూరు వెళ్లే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలునుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు జీఆర్పీ రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రేపు పలమనేరులో సాహిత్యసభ

పలమనేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు లయన్స్‌క్లబ్ ఆవరణలో ఈనెల 29న ఉదయం 10 గంటలకు సాహిత్య సభ నిర్వహిస్తున్నట్లు పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు మాధవ్, అధ్యక్ష కార్యదర్శులు పలమనేరు బాలాజీ, డి.కుమారస్వామిరెడ్డి తెలిపారు. సభకు సాహిత్య అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

6న కళామందిరం వార్షికోత్సవం

పలమనేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 6వ తేదీన తెలుగు సాహిత్య , సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నిర్మించిన కళామందిరి మూడో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి.తులసీనాథం నాయుడు, పి.పుష్ప తెలిపారు. కార్యక్రమంలో పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

దోమల నివారణకు సహకరించాలి



నీళ్లకుంటలో నిర్వహించిన ర్యాలీలో వైద్యసిబ్బంది

పలమనేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : దోమల నిర్మూలనకు అందరూ సహకరించాలని వైద్యఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని నీళ్లకుంటలో శుక్రవారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యసిబ్బంది, నీళ్లకుంట మహిళలు పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయుల భర్తీ ఎప్పటికో !

- సీఆర్పీలు, ఎంటీఎస్ ఉపాధ్యాయులతో సర్దుబాటు
- విద్యార్థులకు అంతంతమాత్రం చదువులు
- పట్టించుకోని అధికారులు , ప్రజాప్రతినిధులు



ఎద్దులగట్టు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న పిల్లలు

రామకుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని పలు పాఠశాలల్లో కొన్నేళ్లగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో పాలకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారుల నిర్వాకంతో విద్యార్థులు ఇక్కట్ల పాలవుతున్నారు. గత మూడున్నరేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని 14 ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలున్నాయి. మూడేళ్ల క్రితం జరిగిన బదిలీల్లో ఈ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయారు. కొన్ని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారు. బదిలీ, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీని అప్పటి పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులకు సరైన విద్యాబోధన కరవైంది. అప్పటి నుంచి సీఆర్పీలు, ఎంటీఎస్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. మండలంలో ఉన్న ఎంటీఎస్ ఉపాధ్యాయుల కాలపరిమితి గత వేసవి సెలవులకు ముందు ముగిసిపోయింది. దీంతో ఈ విద్యాసంవత్సరం పాఠశాలల పునఃప్రారంభం నుంచి మండలంలో 14 ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయులకు లేక విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. వారు పాఠశాలల ఆవరణలో ఆటలాడటం తప్ప విద్యాబోధనకు నోచుకోవడం లేదు. అంతే కాకుండా కొత్తగా ఒకటో తరగతిలో తమ పిల్లలను ఎలా చేర్చాలో తెలియక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ టీసీల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ఎంఈవో నారాయణప్పను వివరణ కోరగా మండలంలో 14 ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఏళ్లగా ఖాళీగా ఉండటం వాస్తవమేనన్నారు.

అప్పటి నుంచీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. డీఎస్సీ తర్వాత అన్ని పోస్టులు భర్తీ అవుతాయన్నారు. రెండు, మూడు రోజుల్లో ఎంటీఎస్ ఉపాధ్యాయులు తిరిగి విధులకు హాజరు కానున్నారని, వారితోపాటు సీఆర్పీలతో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను భర్తీ చేసి విద్యార్థులకు అసౌకర్యం కాకుండా చూస్తామని ఆయన తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇంటి వద్ద సోమల, పుంగనూరు, పులిచెర్ల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమస్యలు, అభివృద్ధి పనులపై వివరించారు. పుంగనూరు మండలం నేతిగుట్టపల్లెకు తాగునీరు, విద్యుత్ సమస్య ఉందని నాయకులు తెలిపారు. సోమల మండలం కందూరులో ఉన్న పాత పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదం ఉందని.. తొలగింపు చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ బోయకొండ మెంబరు పోతపోలు శ్రీనివాసులు చెప్పారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూటమి పాలనలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తోతాపురి రకానికి కిలోకి రూ.4 ప్రోత్సాహకం అందిస్తోందని తెలిపారు.

సారా స్వాధీనం.. నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ నాగరాజు, సిబ్బంది

కుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు కుప్పం మండలంలో విస్తృతంగా దాడులు చేపట్టారు. కుప్పం నుంచి బరుగూరు వెళ్లే బస్సు మార్గంలో మోట్లచేను బస్టాప్ వద్ద ఎం.మల్లేశ్ వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. అతనిడికి నాటుసారా సరఫరా చేసిన కుప్పం మండలం మారెమ్మగుడి కొట్టాలు గ్రామానికి చెందిన ఎ.అయ్యప్ప, ఎ.వెంకటేశ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. వీరిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. నాటుసారా విక్రయాల గురించి ఎవరికి తెలిసినా సీఐ నాగరాజు (9885399789), ఎస్ఐ మోహన్ (9441949568)లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నారాయణ

సోమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు వేగవంతంగా చేయాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. శుక్రవారం కందూరు మేజర్ పంచాయతీలో ఆయన పర్యటించి ఇంటింటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ వాహనంలోనే తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వస్తువులను వేర్వేగా వేయాలన్నారు. ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



కార్మికులకు మద్దతు తెలిపిన మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ అలీంబాషా డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన రిలే నిరహార దీక్షకు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు వివిధ రకాల నిరసనలు తెలిపినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీరాములు, విజయ్‌కుమార్, సుదర్శనరాజు, జవహర్‌అలీ, బాలాజీ, సంతోష్, లజపతి, సోము, ఆంజప్ప, భాను, శైలజ. పద్మ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు చైర్మన్‌ను కలిసిన టీడీపీ నేతలు



అమాస రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 27 (ఆంధజ్యోతి): డీసీసీ బ్యాంకు చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డిని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి ఆధ్వర్యంలో రామకుప్పం మండలానికి చెందిన టీడీపీ నేతలు శుక్రవారం చిత్తూరు డీసీసీ బ్యాంకులో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రామకుప్పం మండలంలోని రైతులకు విరివిరిగా రుణాలిచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత మండలాధ్యక్షుడు వెంకటాచలం, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు గిరిదాసు, నేతలు, రామలింగా రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

పుంగనూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు... మండలంలోని ఏతూరు పంచాయతీ కొత్తపల్లెకు చెందిన నాగరాజ కుమారుడు శ్రీనివాసులు టమోటా మొక్కలకు నీటిని కట్టడంతో పక్కనే ఉన్న మురళీ పొలంలోకి నీరు వెళ్లాయి. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. శ్రీనివాసులు, గణేష్‌లను మురళీ, అతని భార్య గౌరీ, కుమారుడు బాలాజీలు దాడి చేసినట్లు శ్రీనివాసులు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాసులు, గణేష్‌లు దాడి చేసినట్లు మురళీ ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పనుల్లో యంత్రాల వాడకాన్ని ఆపాలి

బైరెడ్డిపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె సమీపంలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి పనుల్లో ఎక్స్‌కవేటర్లతో జరిగే పనులను రాత్రిపూట జరగకుండా అధికారులు నిలుపుదల చేయాలని వీసీసీ జాయింట్ సెక్రటరీ అనిల్ డిమాండ్ చేశారు. రహదారి పనులు జరుగుతున్న ప్రదేశానికి సమీపంలో నివాస గృహాలు ఉన్నాయని రాత్రిపూట యంత్రాల శబ్దంతో నిద్రలేకుండా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఘనంగా వారాహిదేవి నవరాత్రులు ప్రారంభం



అలంకరణలో వైష్ణవిదేవి

చౌడేపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం వారాహి దేవి నవ రాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



అలంకరణలో బోయ కొండ గంగమ్మ

చౌడేపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు రాహుకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని ముత్యాలమ్మ అమ్మవారికి శుక్రవారం ఆషాడ మాసం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకించారు. అర్చనలు చేశారు. ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు.

బాటగంగమ్మ ఆలయంలో పూజలు



విశేషాలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె, జూన్ 27 (ఆంధ్ర జ్యోతి): బైరెడ్డిపల్లెలోని బాట గంగమ్మ ఆలయంలో ఆషాడ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగేంద్ర అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయదారులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి: టీడీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న కోదండయాదవ్

పాలసముద్రం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని టీడీపీ శ్రేణులకు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బాలకృష్ణాపురం, ఆముదాల, వెంగళరాజుకుప్పం, నరసింహాపురం, కోదండరామాపురం, తిరుమలరాజుపురం, గంగమాంబాపురం పంచాయతీల్లో టీడీపీ సంస్థాగత ఎన్నికలను నిర్వహించారు. మండల నాయకుల్లో వర్గ విభేదాల కారణంగా పంచాయతీ అధ్యక్ష, ప్రధానదర్శులను ప్రస్తుతానికి ఎన్నుకోలేదు. మిగిలిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, నాయకులు వాసునాయుడు, తాళ్లూరు శివానాయుడు, సి.రాజేంద్రన్, శేఖర్ రాజు, అరుళ్‌నాథన్, సాంబశివన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



సదస్సులో ప్రసంగిస్తున్న తహసీల్దార్ పార్థసారథి

యాదమరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ పార్థసారథి పిలుపునిచ్చారు. శుక్రవారం భూమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటాపురం దళితవాడలో నిర్వహించిన సివిల్‌రైట్స్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీల గ్రామాల్లో భూములు, దారి ఆక్రమణలతోపాటు దళితుల జీవనానికి ఆటంకం కల్పిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామంలోని శ్మశానానికి దారి, ఇళ్ల పట్టాలు, నీవానదిపై బ్రిడ్జి మంజూరు చేయాలని స్థానికులు విన్నవించారు. దళిత సంఘం కమిటీ సభ్యులు మురుగేశన్, చిట్టిబాబు, కుమార్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



అపోలో యూనివర్సిటీలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వీసీ వినోద్ భట్

చిత్తూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను వీసీ వినోద్ భట్ ప్రారంభించారు. ల్యాబ్‌లో అత్యాధునిక కంప్యూటర్లు, హైస్పీడ్ ఇంటర్నెట్, ఇతర అవసరమైన ఉపకరణాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల అసైన్‌మెంట్లు, పరిశోధనలకు ఉపయోగపడుతుందని చెప్పారు. రిజిస్ట్రార్ పోతురాజు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ జగదీశన్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ భాస్కర్‌రెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ రామయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిద్దాం: టీడీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న బొమ్మన శ్రీధర్

యాదమరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేద్దామని టీడీపీ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం యాదమరిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణపై మండల స్థాయి సమావేశం జరిగింది. కార్యకర్తలు, నాయకులకు నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మన శ్రీధర్, ప్రత్యేక పరిశీలకులు కన్నయ్య నాయుడు, కుమారి, మండల పరిశీలకుడు చౌడప్ప దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు హేమగిరి, చిత్రానాయుడు, పూతలపట్టు బీసీ సెల్ అధ్యక్షుడు ధరణీప్రకాష్, నాయకులు సతీష్ నాయుడు, రవి, పట్టాభి, దాము తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ



అరగొండలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

తవణంపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా దినం సందర్భంగా శుక్రవారం అరగొండలోని నర్సింగ్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్, జిల్లా సబ్ యూనిట్ అధికారి శివసుబ్రహ్మణ్యం, స్థానిక సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, మండల వైద్యాధికారి కేశవ నారాయణ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు: డీపీవో



పచ్చికాపల్లంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో సుధాకరరావు

వెదురుకుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకరరావు ఆదేశించారు. శుక్రవారం పచ్చికాపల్లం, నల్లవెంగనపల్లె పంచాయతీల్లో జరుగుతున్న ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఎంపీడీవో పురుషోత్తంతో కలసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలంలోనూ ఐవీఆర్ఎస్ పంచాయతీలుగా ఎంపిక చేసి.. వాటి పరిధిలో నిత్యం చెత్త సేకరణ జరుగుతోందని చెప్పారు. కాగా, వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో డీపీవో సమావేశమయ్యారు. రోడ్ల పక్కన పేడదిబ్బలు, చెత్తకుప్పల నిల్వలు ఉంటే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జూమ్ మీటింగ్‌కు హాజరైన డీఎంహెచ్‌వో సుధారాణి, అధికారులు

చిత్తూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్ ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు. వర్షాకాలంలో దోమల వల్ల సోకే మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి ఓపీ కేసునూ ఈహెచ్‌ఆర్‌లో తప్పక నమోదు చేయాలని చెప్పారు. అలాగే మతాశిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సీడీ సర్వేపై నిఘా ఉంచాలని డీఎంహెచ్‌వో సుధారాణిని ఆదేశించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


నగరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బోధన కోసం అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంటెక్ కంప్యూటర్స్‌లో 55శాతం మార్కులు కలిగి ఉన్నవారు అర్హులన్నారు. ఎం.ఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ-నెట్, ఏపీసెట్, ఏపీసెట్ అర్హతలున్నవారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 30 తేదీన ఉదయం 10.30 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

30న గుడిపాల మండల సమావేశం

గుడిపాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండల సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీవో శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

గుంతలమయంగా వావిల్‌తోట రోడ్డు

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



పూతలపట్టు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - కడప జాతీయ రహదారి నుంచి వావిల్‌తోటకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీనివల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ మార్గంలో జెట్టిపల్లె, కొత్తూరు, వావిల్‌తోట, ఈడిగపల్లె, అబ్బిరెడ్డిపూరు, మూర్తిగానిపూరు, లక్ష్మయ్యపూరుతోపాటు పలు గ్రామాలున్నాయి. ఈ దారిలోనే కాణిపాకానికి సైతం వాహనాలు వెళుతుంటాయి. ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఆర్టీసీ సర్వీసులూ నడుస్తున్నాయి. ఇంతటి ప్రధానమైన మార్గంలో 30 ఏళ్ల కిందటి రోడ్డు కావడంతో పూర్తిగా దెబ్బతిని.. గుంతలతో నిండిపోయింది. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ గుంతలు కుంటలను తలపిస్తుంటాయి. నొచ్చుపల్లె గ్రామ సమీపంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షం వస్తే మురుగు నిలిచి ప్రమాదాలకు కారణమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



జయచంద్ర (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. తంబుగానిపల్లె దళితవాడకు చెందిన అంజలి, మనోహర్ కుమారుడు జయచంద్ర (19) తన ద్విచక్రవాహనంలో చిత్తూరు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటాక చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని తంబుగానిపల్లె క్రాస్ వద్దకొచ్చేసరికి పలమనేరు నుంచి కూరగాయలు తీసుకెళుతున్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జయచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం సీఐ తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా తంబుగానిపల్లె క్రాస్



తంబుగానిపల్లె క్రాస్ ప్రమాదాలకు నిలయంగా మారింది. కొత్తవెంకటాపురం, తంబుగానిపల్లె, జిల్లేడుపల్లె, మంగళపల్లె, 65వెంకటాపురం, హస్సేన్‌పురంతోపాటు పలు గ్రామాలకు ఈ క్రాస్ మీదుగానే వెళ్లాలి. ప్రస్తుతం ఈ గ్రామాలకు వెళ్లడానికి కేజీ సత్రం వద్ద ఉన్న జంక్షన్ నుంచి రాంగ్ రూట్‌లో తంబుగానిపల్లె క్రాస్‌కు చేరుకోవాలి. దీనివల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పైగా ప్రాంతంలో రోడ్డు ఏటవాలుగా ఉండటంతో వాహనాలు కూడా వేగంగా వస్తుంటాయి. ఇప్పటికే ఈ జంక్షన్ వద్ద 10 మంది వరకు మృతి చెందారు. ఈ ప్రమాదాల నివారణకు ఇక్కడ ఫ్లైవోవర్ నిర్మించాలని కలెక్టర్‌కు, నేషనల్ హైవే అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి ఫ్లైవోవర్ నిర్మిస్తే ప్రమాదాలను నిలువరించవచ్చు.

థామస్ పుట్టినరోజు వేడుకలకు భారీ ఏర్పాట్లు

గంగాధరనెల్లూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ వి.ఎం.థామస్ పుట్టినరోజు సందర్భంగా గంగాధరనెల్లూరు పంచాయతీ రామానాయుడుపల్లె వద్ద 10 ఎకరాల స్థలంలో భారీ ఏర్పాట్లు చేశారు. శనివారం 10వేలమందికి దుస్తులు, 10మంది దివ్యాంగులకు బ్యాటరీ త్రీవీలర్ సైకిళ్ల పంపిణీతోపాటు 20వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం డీఎస్పీ సాయినాథ్, సీఐలు నెట్టికంఠయ్య, ఉమామహేశ్వర్ పరిశీలించారు. థామస్ పీఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో వైద్య పరీక్షలు



బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సిబ్బంది

యాదమరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో 60 మంది బాలికలకు రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌ఎన్ శాంతమ్మ, భానుప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ సరస్వతి, ఏఎన్‌ఎం సురేందర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులకు మద్దతు పలుకుతున్న వైసీపీ నేతలు

చిత్తూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న నిరసనకు వారు మద్దతు పలికారు. వైసీపీ నేతలు నారాయణ, హరిణీరెడ్డి, కార్మికుల సంఘ అధ్యక్షుడు శరవణ, నేతలు శివకుమార్, శివప్రసాద్, వెంకటేశ్, డియా,వేలు, సునీల్ కుమార్, ఉష, పీరుల్లా తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం



ధ్వజస్తంభం వద్ద పూజలు

వెదురుకుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మహాభారత ఉత్సవాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మేళం రవియాదవ్ సారెను సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో కార్వేటినగరానికి చెందిన రేవతిప్రసాద్ వితరణతో అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడితోకలిసి ప్రధానకార్యదర్శి బి.గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షుడు కె.రవిరెడ్డి, కోశాధికారి కె.లక్ష్మీపతి, ఉపకోశాధికారి ఆర్.సాయిరాయల్ పర్యవేక్షించారు.

బైక్ బోల్తా: యువకుడికి తీవ్రగాయాలు



గాయపడ్డ తమిళియన్

శ్రీరంగరాజపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి బైక్ బోల్తాపడటంతో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన ఎస్ఆర్‌పురం మండలంలో శుక్రవారం జరిగింది. యాదమరి మండలం కీనాటంపల్లె పంచాయతీ షికారీ కాలనీకి చెందిన రమేష్ కుమారుడు తమిళియన్ తమిళనాడులోని పళ్లిపట్టు నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తున్నాడు. ఎస్ఆర్‌పురం మండల కేంద్రానికి వచ్చేసరికి అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. తొలుత స్థానిక పీహెచ్‌సీకి తరలించి, తర్వాత మెరుగైన వైద్యం కోసం చిత్తూరుకు తీసుకెళ్లారు.


ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు 27 అర్జీలు



వృద్ధుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న మేయర్ అముద తదితరులు

చిత్తూరు సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు 27 అర్జీలు వచ్చాయి. బాధితుల నుంచి అర్జీలను మేయర్ అముద స్వీకరించారు. కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. వచ్చిన అర్జీల్లో.. నీటి సరఫరా, పారిశుధ్యం, వీధిదీపాల సమస్యలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈ వెంకటరామి రెడ్డి, చిత్తూరు రూరల్ ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ ఇబ్రహీం, హౌసింగ్ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారిగా కృష్ణచైతన్య



వెదురుకుప్పం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ కృష్ణచైతన్య బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా నెరబైలు పీహెచ్‌సీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు కార్వేటినగరం మండలం కత్తెరపల్లె పీహెచ్‌సీ డాక్టర్ యార్లపల్లి హేమశ్రీ ఇక్కడ ఇన్‌చార్జిగా కొనసాగారు.

సామాజిక సేవే 'జన జాగృతి' లక్ష్యం



'జన జాగృతి' కార్యాలయాన్ని ప్రారంభించిన వసంత్‌కుమార్

చిత్తూరు సెంట్రల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే లక్ష్యంగా జన జాగృతి స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు వసంత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎంఎస్ఆర్ కాంప్లెక్స్‌లో జన జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, అధ్యక్షురాలు అనసూయ, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు బ్రహ్మానందం, రామభద్ర, కరుణాకర్, రాజు, ప్రభు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పందుల సంచారంతో జనానికి తిప్పలు

నగరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని టీఆర్ కండ్రిగలో పందుల సంచారం అధికంగా ఉండటంతో జనానికి తిప్పలు తప్పడం లేదు. పందుల కారణంగా దుర్గంధం వెదజల్లడమే కాకుండా, దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు చెప్పినా ఫలితం లేదని చెప్పారు.



టీఆర్‌కండ్రిగలో సంచరిస్తున్న పందులు

పిచ్చి మొక్కలను తొలగించండి



బంగారుపాళ్యం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న శవపరీక్ష గది ముందు పిచ్చిమొక్కలు ఎక్కువయ్యాయి. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి మూడో శనివారం కార్యాలయాలు, ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేయాలి. కానీ వైద్యసిబ్బంది సరిగా శుభ్రం చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఈ పిచ్చిమొక్కలు తొలగించాల్సి ఉంది. దీనికితోడు ప్రభుత్వాస్పత్రి ముందు ప్రైవేటు వ్యక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

విద్యా సామగ్రి వితరణ



విజయపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లసముద్రం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నగరి బాలమురుగన్ స్టోర్ యజమాని రాధాకృష్ణా శుక్రవారం విద్యా సామగ్రిని విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య ద్వారా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుధ, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

నగరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలో పీఎంశ్రీకి ఎంపికైన జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయ, అసిస్టెంట్ ఇంజనీరు నాగభూషణం పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు



వెదురుకుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జక్కిదొన లోని ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త భీమనేని మాధవనాయుడు పర్యవేక్షించారు.

మాదకద్రవ్యాల వాడకంతో దుష్ప్రభావాలపై అవగాహన

వెదురుకుప్పం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాల వాడకంతో తలెత్తే దుష్ప్రభావాలపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

'కాంక్రీట్ ఫ్యాక్టరీ' ప్రారంభం



గుడిపాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గొల్లమడుగు క్రాస్ నుంచి చిత్తపారకు వెళ్లే రహదారిలో శుక్రవారం ఎస్ఎన్ రెడీ మిక్సింగ్ కాంక్రీట్ ఫ్యాక్టరీని జీజేఎం ట్రస్ట్ నిర్వాహకుడు చెన్నకేశవుల నాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు బాలాజీ నాయుడు, పీటర్, అనిల్ కుమార్, హరి, బాలసుబ్రహ్మణ్యం, శంకర్ చౌదరి, కుమార్, మురళి నాయుడు, ఫ్యాక్టరీ యజమానులు సుదర్శన్, నితీష్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నేత్ర వైద్య ఉచిత శిబిరం

చిత్తూరు కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని రాములగుడి వీధిలో ఉన్న జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం జైన్ సంఘం ఆధ్వర్యంలో నేత్ర వైద్య ఉచిత శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ తెలిపారు. ఉదయం 7నుంచి 11గంటల వరకు తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో నిర్వహించనున్న ఈశిబిరాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.